సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం ; 29 ; జూలై ; 2025



అత్యాధునిక వ్యవస్థ సీసీటీఎన్ఎస్

సీసీటీఎన్ఎస్ పోలీసు పనితీరును సమూలంగా మార్చే అత్యాధునిక వ్యవస్థ అని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. సీసీటీఎన్ఎస్ ద్వారా నేరాల దర్యాప్తును వేగంగా చేయచ్చన్నారు. - 8లో



హత్యాయత్నం కేసులో పదేళ్ల జైలుశిక్ష

ఓ వ్యక్తిపై హత్యా యత్నం చేసిన నిందితుడికి పదేళ్ల జైలు-శిక్షతో పాటు రూ.30వేల జరిమానా విధిస్తూ మదనపల్లె 7వ అడిషనల్ జిల్లా కోర్టు జడ్జి శ్రీలత తీర్పు ఇచ్చారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.440	రూ.550
రెండోరకం	రూ.300	రూ.420

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 396 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	490	502
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 69.760 కిలోలు

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి టౌన్ : జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ సెక్రటరీల నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-2026, 2026-2027 సంవత్సరానికి సంబంధించి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఇందుకోసం అర్హత, ఆసక్తి గలిగిన వ్యాయామ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.నియామక ప్రక్రియ మెరిట్ ఆధారంగా కొనసాగుతుందన్నారు. ఈ నెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

టమాట కిలో రూ.55



మదనపల్లె : టమాట ధరలు పైపైకి పాకుతున్నాయి. మొన్నటిదాక ధరలేక రైతాంగం నష్టాలను చవిచూశారు. పంట చివరిదశలో ధర వస్తుండటంతో ఆశలతోపాటు నిరాశ వ్యక్తం అవుతోంది. సోమవారం మదనపల్లె మార్కెట్‌లో టమాట కిలో ధర రూ.55 పలికింది. ఇది ఈ సీజన్‌లో రికార్డు ధరగా నమోదైంది. రాష్ట్రంలో అతిపెద్ద టమాట మార్కెట్ కావడంతో ఇక్కడి దేశ వ్యాప్తంగా వ్యాపారులు టమాట కొనుగోలుకు వస్తారు. ఇక్కడ తక్కువ ధర కిలో రూ.30 పలికింది. విక్రయానికి 396 టన్నుల టమాట వచ్చింది. ములకలచెరువు మార్కెట్‌లో కిలో రూ.32 నుంచి రూ.46 పలికింది. విక్రయానికి 415 టన్నులు వచ్చాయి. చిత్తూరుజిల్లా పుంగనూరు మార్కెట్‌లో కిలో టమాట రూ.34 నుంచి రూ.41 వరకు పలికింది. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో అత్యధిక టమాట వచ్చే ఈ మార్కెట్‌లో విక్రయానికి 237 టన్నులే వచ్చాయి. పలమనేరు మార్కెట్‌లో కిలో టమాట రూ.36 నుంచి రూ.43 పలికింది. విక్రయానికి 218 టన్నులు వచ్చాయి. వీ.కోట మార్కెట్‌లో కిలో టమాట రూ.35 నుంచి 41 పలికింది. విక్రయానికి 55 టన్నులు వచ్చాయి. ఈ ధరలు ఇంకా పైకి ఎగబాకే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

మదనపల్లె వన్‌టౌన్ సీఐ సస్పెన్షన్

రాయచోటి : మదనపల్లె వన్ టౌన్ సీఐగా పనిచేస్తున్న ఎరీషా వల్లిని సోమవారం సస్పెండ్ చేస్తూ పోలీసు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వెలువడినట్లు తెలిసింది. విధి నిర్వహణలో తలెత్తిన కొన్ని విషయాలపై విచారణ అనంతరం శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలియవచ్చింది.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

మదనపల్లె సిటీ : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని కేజీబీవీ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ సి.దేవరాజు అన్నారు. సోమవారం మదనపల్లె పట్టణం చిత్తూరురోడ్డులోని గ్రీన్‌వ్యాలీ పాఠశాలలో 10 జిల్లాలకు చెందిన కేజీబీవీ విద్యాలయ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. నెల్లూరు కడప, కర్నూలు, అనంతపురం, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు, నంద్యాల, సత్యసాయి జిల్లాలకు చెందిన 173 ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌భాషా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సామాజికాంశాల పట్ల విద్యార్థులకు ఉత్తమ అవగాహన కల్పించడం ద్వారా వారిని పోటీ ప్రపంచంలో ముందుంచుగలమన్నారు కార్యక్రమంలో సీఎంఓ, ఇన్‌చార్జ్ కరుణాకర్. వెండర్ చంద్రశేఖర్‌రెడ్డి, అడ్మిన్ దివాకర్, ఆర్‌పిలు పాల్గొన్నారు.

హెలీప్యాడ్ కోసం స్థల పరిశీలన

జమ్మలమడుగు : జమ్మలమడుగులో ఆగస్టు 1న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్ భూపేష్‌రెడ్డి సోమవారం హెలిప్యాడ్ నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు. ముద్దనూరు రోడ్డులో ఉన్న పాలిటెక్నికల్‌కాలేజి ప్రాంతంలోని స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సాయిశ్రీ, తహసీల్దార్ శ్రీనివాసులరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ నాగేశ్వరరెడ్డి ,గొనా పురుషోత్తం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

31న ఇంటర్వ్యూలు

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన యూనివర్సిటీ పీజీ కళాశాలలోని ఎమ్మెస్సీ మైక్రోబయాలజీ విభాగంలో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కోసం ఈ నెల 31న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ తెలిపారు. మైక్రోబయాలజీలో పిహెచ్‌డి, నెట్/ స్లెట్ అర్హత కలిగిన వారికి ఎంపికలో ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. అర్హత ప్రమాణాలు ఉండి ఆసక్తిగల అభ్యర్థులు బయోడేటా అలానే సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా ప్రిన్సిపల్ కార్యాలయంలో జరిగే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. ఒక పోస్టు మాత్రమే ఖాళీ ఉందన్నారు. వివరాలకు yvu.edu.inను సందర్శించాలని ప్రిన్సిపల్ సూచించారు.

ఆక్రందన.. ఆవేదన

- మొన్నటి వరకు టన్ను 18,000.. ఈరోజు 7వేలకు పడిపోయిన ధర
- రాజంపేట, కోడూరులలో బొప్పాయి రైతుల నిరసన
- కూటమి సర్కారులో రైతులకు కష్టాలు
- వైఎస్ జగన్ ప్రభుత్వంలో ధరల స్థిరీకరణ నిధితో అత్యుత్తమ ధరలు



రాజంపేటలో సాగులో ఉన్న బొప్పాయి

సాక్షి రాయచోటి : కూటమి సర్కార్ ఏర్పడిన నాటి నుంచి రైతులకు కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం జిల్లాలో వర్షాలు లేక కరువు ఛాయలు అలుముకున్నాయి. ప్రభుత్వం ఉన్నా...ధరల స్థిరీకరణ నిధి లేకపోవడంతో పండ్ల తోటల రైతుల కష్టాలు వర్ణణాతీతంగా ఉన్నాయి. ఎంతో కష్టం చేసి...ఎన్నెన్నో అగచాట్లు పడి పంట పండిస్తే తీరా నోటికి కాడికి వచ్చేసరికి ధరల విషయంలో దళారులు, వ్యాపారులు ఆడుతున్న నాటకంలో రైతులు బలి పశువులుగా మారుతున్నారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటింది. అయితే ధరల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో ఇటీవల వరుసగా దోస, టమాటా, మామిడి రైతులు పడిపోయిన ధరలతో అమ్ముకోలేక నష్టాల పాలయ్యారు. అయితే ప్రస్తుతం బొప్పాయి పంటకు కూడా ధరలు ఒక్కసారిగా వ్యాపారులు తగ్గించడంతో రైతన్నలు రోడ్డెక్కారు.

నాడు అలా....నేడు ఇలా.....

అన్నమయ్య జిల్లా పండ్ల తోటలకు ప్రసిద్ధి. ప్రధానంగా మామిడి, అరటి, బొప్పాయి, చీనీ, దోస, దానిమ్మ ఇలా చెబుతూ పోతే అనేక రకాల పండ్ల తోటలను సాగుతున్నాయి. వైఎస్సార్ సీపీ సర్కార్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రత్యేకంగా ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు రేయడంతోపాటు ఎప్పటికప్పుడు ధరలపై సమీక్షిస్తూ వచ్చారు. దీంతో ఇతర పండ్లు, కూరగాయల తోటలతోపాటు బొప్పాయి కూడా మంచి ధర పలికింది. గతంలో ఒక్కోసారి రూ.20 వేలకు కూడా అమ్ముకున్నారు. వారం రోజుల కిందటి వరకు టన్ను బొప్పాయి రూ. 16 వేలు ధర పలుకగా, ప్రస్తుతం ఒక్కసారిగా రూ. 9-10 వేలకు తగ్గించడంపై రైతన్నలు ఆందోళన చెందుతన్నారు. కూటమి సర్కార్ పండ్ల ధరలు తగ్గిస్తున్నా పట్టించుకునే పరిస్థితి కానరాకపోవడంపై అప్పుడు అలా...ఇప్పుడు ఇలా అనుకుంటూ రోడ్డెక్కుతున్నారు.

వ్యాపారులతో దళారుల ములాఖత్

జిల్లాలోని రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాలతోపాటు కలికిరి, మదనపల్లె, కలకడ, గుర్రంకొండ, పీలేరు తదితర ప్రాంతాల్లో బొప్పాయి పంట విస్తారంగా సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 16 వేల ఎకరాల్లో పంట సాగైంది. అయితే ఇంతవరకు బా గానే ఉన్నా...తీరా పంట చేతికివచ్చాక దళారులు, వ్యా పారులు ములాఖత్‌గా మారి ధరలు తగ్గిస్తున్నారు. మొన్నటివరకు రూ. 16-18 వేలు పలికిన ధర ఒక్క సారిగా రూ. 9-10 వేలకు పడిపోవడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం దళారులు, వ్యాపారులు కుమ్మక్కై ధరలను తగ్గిస్తున్నారని అన్న దాతల్లో ఆగ్రహావేశాల్లో వ్యక్తమవుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు సరుకులను లారీల్లో తరలిస్తుంటారు. ప్రతిరోజు 100-150 ట్రిప్పుల మేర ఇతర ప్రాంతాలకు వెళుతుంటాయి. అయితే అక్కడి వారితో దళారులు ఒప్పందాలు కుదుర్చుకుని ధరలు తగ్గించినట్లు రైతులతోపాటు వామపక్ష పార్టీల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఒక్కసారిగా ధరలు పతనం కావడంపై బొప్పాయి రైతు రోడ్డెక్కారు. రెండు రోజుల కిందట రైల్వేకోడూరులో, సోమవారం రాజంపేటలోనూ రైతులు రోడ్డెక్కి నిరసనకు దిగారు. మద్దతు ధరలు కల్పించకపోగా, ప్రస్తుతం ఉన్న ధరలను కూడా తగ్గించడంపై వారు పూర్తి స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించారు.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి



7 ఎకరాల్లో బొప్పాయి పంటసాగు చేశాను. సాగుకోసం రూ.18లక్షలు ఖర్చు చేశా. చేశా. దిగుబడులు వచ్చే సమయానికి ధరలు పతనమయ్యాయి. దీంతో రూ.10 లక్షలు మాత్రమే వచ్చింది. కష్టానికి తగిన ప్రతిఫలం రాలేదు. అందువల్ల పంటను పొలంలోనే వదిలేసి టమాటా సాగు చేపట్టా.బొప్పాయి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. - జి.సిద్దయ్య నాయుడు, బావుకాడపల్లె, సంబేపల్లె మండలం.

దళారుల పెత్తనంపై తిరుగుబాటు బావుటా

రాజంపేట : ఉద్యానవనపంటలకు నిలయమైన రైల్వేకోడూరులో బొప్పాయి ధరలపై దళారుల పెత్తనంపై బొప్పాయి రైతులు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. టన్ను రూ.10వేలకు తగ్గించేందుకు దళారులు, ఇతర రాష్ట్రాల వ్యాపారులు సమావేశమై నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమైన క్రమంలో తమకు అన్యాయం జరిగే పరిస్థితులు దారితీస్తున్నాయని ఆందోళన వ్యక్తమైంది. సోమవారం గిట్టుబాటు ధర కోసం సబ్‌కలెక్టరేట్‌లో అన్నమయ్య భవన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం బొప్పాయిరైతులను పట్టించుకోవడంలేదని ధ్వజమెత్తారు.

లైసెన్స్ లేకుండా వ్యాపారం..

బొప్పాయి రైతులను మోసం చేస్తున్న దళారులు, వ్యాపారులు ఎటువంటి లైసెన్స్ లేకుండా కోట్లాది రూపాయల వ్యాపారం సాగిస్తున్నారని రైతులు ఆరోపించారు. విత్తనం కిలో రూ.4లక్షలు పెట్టాల్సి వస్తోంది. అందులో నాసిరకం, కల్తీ విత్తనాలు రైతులకు సరఫరా చేస్తున్నారు. నర్సరీలో చెట్టు రెండు నెలల తర్వాత రూ.15 కొనుగోలు చేయాల్సి వస్తోంది. 1000కేజీలకు 100కేజీలు తరుగు సూట్‌పేరుతో రైతులను నుంచి తీసుకుంటున్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు ...

మార్క్‌ఫెడ్ ద్వారా బొప్పాయిని కొనుగులో చేయాలని, కనీస ధర రూ.25 నిర్ణయించి రైతుల నుంచి బొప్పాయికాయలను తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రైల్వేకోడూరులో దళారులు, వ్యాపారులు మోసాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. ఈ మేరకు సబ్‌కలెక్టర్ వైభోమా నైదియాదేవికి బొప్పాయిరైతులు వినతిపత్రంను అందచేశారు. ఉద్యానవన,మార్కెటింగ్‌తో పాటు సంబంధిత అధికారులతో సమావేశమై , రెండురోజుల్లో న్యాయం చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.ఏపీ రైతుసంఘం జిల్లానేత పందికాళ్లమణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, బొప్పాయి రైతులు మద్దిన కోటయ్యనాయుడు, గిరి, పెంచల్‌రెడ్డి,తుంగా కృష్ణచౌదరి, విశ్వనాథరెడ్డి,ఈశ్వరయ్య,శివారెడ్డి,నాని,రవిరాజు, వీ.రాజా,చింజి సుబ్రమణ్యం,కొండలసాయిబాబా, వై.ఆదినారాయణతోపాటురైతులు సబ్‌కలెక్టర్‌ను కలిసినవారిలో ఉన్నారు.

మామిడిరైతుల బాటలోనే బొప్పాయిరైతులు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిర్వకం వల్ల మామిడిరైతులు పండించిన పంటలను రోడ్లపాలు చేసుకున్నారు. గిట్టుబాటు ధర లేక మామిడితోటలను వదిలేసుకున్నారు. మామిడిరైతుల తరహాలోనే బొప్పాలు రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఆవిష్కృతమవుతున్నాయని రైతుసంఘాల నేతలు భావిస్తున్నారు.

దళారుల పెత్తనాన్ని అడ్డుకుంటాం



దళారులు, వ్యాపారులు ఒక్కటై బొప్పాయి రైతులను నట్టేటా ముంచాలని చూస్తున్నారు. దీన్ని అడ్డుకుంటాం. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలి. మార్క్‌ఫెడ్ ద్వారా బొప్పాయి కొనుగోలు చేయాలి. గిట్టుబాటు ధర కల్పించాలి. - మణి,రైతుసంఘం నాయకుడు,రైల్వేకోడూరు



రాజంపేట: సబ్‌కలెక్టరేట్‌లో అన్నమయ్య సభాభవన్ ఎదుట బొప్పాయి రైతుల నిరసన

ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలు

రాయచోటి : నవ సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులే మూలస్తంభాలని డైట్ ప్రిన్సిపాల్ అజయ్ కుమార్ బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని అర్చన్ కళాశాలలో ఈనెల 28వ తేదీ నుండి 31 వరకు పాఠశాల నాయకత్వ లక్షణాలపై నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణా తరగతులు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు ఉత్తమ బోధకుడిగా ఎదిగితేనే విద్యార్థులు విజేతలుగా మారతారని తెలిపారు.డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ప్రభావితం చేసే వారందరూ లీడర్లేనన్నారు. అర్చన కళాశాల డైరెక్టర్ పి మదన్‌మోహన్ రెడ్డి, సమగ్ర శిక్ష ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ జనార్దన్, కోర్సు కో-ఆర్డినేటర్ షమీఉల్లా, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు వీరాంజనేయులు, డైట్ లెక్చరర్ కరిముల్లా, శిక్షణ ఇచ్చే మాస్టర్ ఫెసిలిటేటర్స్, జిల్లాలోని 280 మంది ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ అజయ్ కుమార్ బాబు

జాతీయ వినియోగదారుల కమిషన్ ప్రధాన కార్యదర్శిగా సురేష్

కడప కార్పొరేషన్ : జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్‌కు చెందిన బి. సురేష్ బాబును నియమించినట్లు ఆ కమిషన్ చైర్మన్ డా. సాయి రమేష్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం అందుకు సంబంధించిన ఐడీ కార్డు, నియామకపత్రం, సభ్యత్వ సర్టిఫికెట్లను జిల్లా చైర్మెన్ కిషోర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ తనను కడప జిల్లా జనరల్ సెక్రటరీగా ఎన్నుకొన్న నేషనల్ చైర్మన్ సాయి రమేష్‌కు, స్టేట్ కోఆర్డినేటర్ మద్దెల సురేష్ బాబుకు, డిస్ట్రిక్ట్ వైస్ చైర్మన్ సి. వి. సుబ్బారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. వినియోగదారులు ఏదైనా వస్తువు కొని మోసపోతే వినియోగదారుల ఫోరంను ఆశ్రయించాలన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా నాయకులు ఉమామహేశ్వర్ రావు, కోట. సుబ్బారావు, చలపతి, శ్రీధర్ పాల్గొన్నారు.

జెడ్పీటీసీ ఉప ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ రాష్ట ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని సోమవారం విడుదల చేశారు. పులివెందుల జెడ్పీటీసీగా ఉన్న తుమ్మల మహేశ్వరరెడ్డి మృతి చెందారు. అలాగే ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానానికి ఆకేపాటి అమర్‌నాథరెడ్డి రాజీనామా చేయడంతో ఆ స్థానం ఖాళీ ఏర్పడింది. ఈ రెండుస్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఈనెల 30న రిటర్నింగ్ అధికారి ఎలెక్షన్ నోటీసు, ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. అదేరోజు నుంచి ఆగస్టు 1వ తేది వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. ఆగస్టు 2వ తేదీ ఉదయం 8 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్ల తిరస్కరణపై కలెక్టర్‌కు అప్పీలు చేసుకునేందుకు మూడవ తేది సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంటుంది. 4వ తేది అప్పీళ్లను పరిష్కరిస్తారు. ఐదో తేది మధ్యాహ్నం 3 గంటల్లోపు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. అదేరోజు మధ్యాహ్నం 3.00 గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. ఆగస్టు 12వ తేది ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఏదైనా కారణాల రీత్యా రీపోలింగ్ నిర్వహించాల్సి వస్తే 13వ తేది ఉదయం 7.00 గంటల వరకు సాయత్రం 5.00 గంటల వరకు ఉంటుంది. 14వ తేది ఉదయం 8.00 గంటల నుంచి కౌంటింగ్ నిర్వహించి ఆ కార్యక్రమం పూర్తయ్యాక ఫలితాలను ప్రకటిస్తారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరపాలక సంస్థలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ సి.అరుణ్ రాజ్‌పై క్రమశిక్షణ చర్యలలో భాగంగా సస్పెండ్ చేస్తూ కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఇంజనీరింగ్ విభాగంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులైన డేటా ఎంట్రీ ఆపరేటర్ వి.ప్రేమ్ కార్తీక్, డ్రైవర్ ప్రతాప్, అటెండర్ యు.రాజ్ కుమార్‌లను క్రమశిక్షణ చర్యల్లో భాగంగా తక్షణమే విధుల నుంచి తొలగిస్తున్నట్లు కలెక్టర్ తెలియజేశారు. వీరు కమిషనర్ లేని సమయంలో ఆయన క్యాంపు కార్యాలయంలో ప్లేయింగ్ కార్డ్స్ ఆడడంపై మీడియాలో వార్తలు రావడంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

సత్వరమే అర్జీల పరిష్కారం

జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి : అర్జీదారుల నుంచి అందిన అర్జీలను నిర్లక్ష్యం చూపకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టిసారించి నిర్ణీత కాలవ్యవధిలోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారంపై సీఎంఓ కార్యాలయం నేరుగా పర్యవేక్షిస్తున్న నేపథ్యంలో ఏమాత్రం అశ్రద్ధ చేయొద్దని సూచించారు.. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదన్ రావు,రాయచోటి ఆర్‌డీఓ శ్రీనివాస్, ఏడీ సర్వేయర్ భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణి శివానికి కృత్రిమ చేయి

రాయచోటి : జన్మతః కుడిచేయి లేకుండా జన్మించిన జవహర్ నవోదయ విద్యాలయ సమితి, మదనపల్లె ఇంటర్మీడియట్ విద్యార్థిని, పారా అథ్లెటిక్ క్రీడాకారిణి కుమారి హెచ్ శివానికి కృత్రిమ కుడి చేయి అమర్చినట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల కేటగిరి పోటీల్లో షాట్‌పుట్, జావెలిన్‌త్రోలలో జాతీయ స్థాయి పారా అథ్లెట్‌గా, థాయిలాండ్, బెంగళూరు, గుజరాత్ వంటి దేశీయ, అంతర్జాతీయ వేదికలపై పోటీపడి మూడు బంగారు పతకాలు సాధించి గర్వించదగిన క్రీడాకారిణి హెచ్ శివాని అన్నారు. ప్రతి ప్రతిభావంతుడికి అవసరమైన వనరులు అందించడం మన బాధ్యత అని కలెక్టర్ తెలిపారు. శివానీ చదువులో, క్రీడలలో మరింత ఉన్నతస్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కుమారి హెచ్ శివానీ కృత్రిమ చేయి ఏర్పాటు కోసం జిల్లా కలెక్టర్‌ను అభ్యర్థించారు. స్పందించిన ఆయన రూ. 21 వేలు మంజూరు చేయగా డిస్ట్రిక్ట్ డిసేబిలిటీ రిహాబిలిటేషన్ సెంటర్ (డీడీఆర్‌సీ) కడప.. దాని అమలు సంస్థ దర్శిని హ్యాండిక్యాప్డ్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా రూ. 39వేలతో అదనపు సహకారం అందించారన్నారు. కుమారి శివానీ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ చేసిన ఈ సహాయం తమ చదువు, క్రీడా జీవితాన్ని సమన్వయం చేసుకొని మరింత మెరుగ్గా రాణించడానికి వీలవుతుందని ఆశిస్తున్నానన్నారు. జిల్లా కలెక్టర్, అధికారులకు, సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు.



క్రీడాకారిణి శివానిని అభినందిస్తున్న కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

ప్రయాణికులకు 'తిరుమల' కష్టాలు!

- రైలు ఒకటే... టికెట్లు రెండు కొనాలి
- విశాఖ నుంచి కడప వరకు ఎక్స్‌ప్రెస్‌గా.. కడప నుంచి గుంతకల్లు వరకు ప్రత్యేక ప్యాసింజర్‌గా రాకపోకలు



తిరుమల ఎక్స్‌ప్రెస్

కడప కోటిరెడ్డిసర్కిల్ : సాధారణంగా దేశంలోని ఏ ప్రాంతంలోనైనా రైలులో ప్రయాణించడానికి ఒక టిక్కెట్ కొనుగోలు చేస్తే సరిపోతుంది. 'తిరుమల ఎక్స్‌ప్రెస్'లో ప్రయాణించాలంటే రెండు టికెట్లు కొనాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆశ్చర్యపోవద్దు.. ఇది నిజం. రైల్వేశాఖ తీసుకున్న వింత నిర్ణయం.

ప్రతిరోజు కడప-విశాఖపట్టణం-కడప మధ్య తిరుగుతున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలును గతనెల 2వ తేదినుంచి గుంతకల్లు వరకు పొడిగించారు. అంత వరకు బాగానే ఉన్నా ఈ రైలును కడప నుంచి గుంతకల్లు వరకు స్పెషల్ ప్యాసింజర్ రైలుగా నడపడం ప్రయాణికులను కష్టాలు తెచ్చి పెడుతోంది. విశాఖపట్టణం నుంచి కడపకు వచ్చిన తర్వాత ఎర్రగుంట్ల, కొండాపురం, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు ప్రాంతాలకు వెళ్లాలంటే కడపలో మరో టిక్కెట్ తీసుకోవాల్సి వస్తోంది. అలాగే గుంతకల్లు నుంచి ఈ రైలులో గుంతకల్లు నుంచి కడప మీదుగా వెళ్లాల్సిన ప్రయాణికులు కడపలో దిగి మరో టిక్కెట్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది. సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులు గమ్యాన్ని చేరుకునేందుకు ఒక రైలులోనే రెండు టిక్కెట్లు కొనాల్సి వస్తోంది.

మహిళలు, వృద్ధులు, లగేజీతో వెళుతున్న వారి ఇబ్బందులు వర్ణణాతీతం

గుంతకల్లు నుంచి తిరుపతి, విజయవాడ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు రైలులో గుంతకల్లు-కడప మధ్య జనరల్ టిక్కెట్ తీసుకుని, ఆ తర్వాత కడప నుంచి ఎక్కడికైనా ఎక్స్‌ప్రెస్ టిక్కెట్‌ను కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఈ క్రమంలో టిక్కెట్ల కోసం కడప రైల్వేస్టేషన్‌లో దిగి మరో టిక్కెట్ కొనాల్సి వస్తోంది. రైల్వే అధికారుల నిర్ణయంతో మహిళలు, వృద్ధులు, లగేజీతో వెళుతున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేశాఖ నిర్ణయంతో పలుమార్లు ప్రయాణికులు ఘర్షణ పడిన సంఘటనలూ లేకపోలేదు. నేరుగా ఒకే టిక్కెట్టుపై ప్రయాణించే సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రయాణికుల రద్దీ మేరకు నిర్ణయం



ప్రస్తుతం కడప-గుంతకల్లు మధ్య స్పెషల్ ప్యాసింజర్‌గా తిరుగుతున్న రైలును ప్రయాణికుల రద్దీ పరిశీలన నిమిత్తం తిప్పుతున్నారు. ప్రయాణికుల ఆదరణ పెరిగితే భవిష్యత్తులో తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను గుంతకల్లు వరకు పొడిగిస్తారు. ప్రస్తుతానికి అన్ రిజర్వుడు ప్యాసింజర్‌గా నడుపుతున్న రైలులో కొద్దిరోజులపాటు ప్రయాణికులు ఇబ్బందులు తప్పవు. - జనార్దన్, రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్, కడప

క్లుప్తంగా

బాలిక అదృశ్యం

సుండుపల్లె : మండల కేంద్రంలోని జనార్దన్ రెడ్డి నగర్‌కు చెందిన షేక్ సమీరా(19) అనే బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు. షేక్ సమీరా ఆదివారం సాయంత్రం నుంచి కనిపించడం లేదని తల్లి నూర్జహాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

చిన్నమండెం : మండల పరిధిలోని కొత్తపల్లి పంచాయతీ రోడ్డువార కురవపల్లి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కృష్ణయ్య(70) అనే వ్యక్తి మృతి చెందాడు. తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రఘురామయ్య తెలిపారు.

అదుపు తప్పి ఆటో బోల్తా

సిద్దవటం : మండలంలోని భాకరాపేట- సిద్దవటం రహదారిలోని 11వ బెటాలియన్ సమీపంలో ఉన్న లోలెవల్ కాజ్‌వే పైనుంచి సోమవారం ఆటో అదుపు తప్పి పెద్ద వంకలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో విజయ్ అనే వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ బాబు మాట్లాడుతూ గువ్వల చెరువు నుంచి పాలకోవా వ్యాపారం నిమిత్తం సిద్దవటం వచ్చామన్నాడు. తిరుగు ప్రయాణంలో భాకరాపేట గ్రామ సమీపంలోని బెటాలియన్ వద్ద ఉన్న లోలెవల్ కాజ్‌వేపై వస్తుండగా బద్వేలు వైపు వెళుతున్న వాహనం ఎదురుగా అడ్డు రావడంతో దాన్ని తప్పించబోయి అదుపు తప్పి ఆటో వంకలో బోల్తా పడిందన్నాడు. ఆటోలో ఉన్న విజయ్ అనే వ్యక్తికి స్వల్ప గాయాలైనట్లు తెలిపాడు.

వీఆర్ఏ ఆత్మహత్య


కృష్ణయ్య (ఫైల్)

ఓబులవారిపల్లె ; కొర్లకుంట వీఆర్ఏ కృష్ణయ్య (68) విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఉదయం ఈత బర్రెల కోసం వెళ్లిన వారికి కొర్లకుంట-కృష్ణపట్నం రైలు మార్గం బ్రిడ్జి సమీపం వద్ద ముళ్లపొదల్లో కృష్ణయ్య మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆదివారం ఉదయం నుండి కనిపించడం లేదని కృష్ణయ్య కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతుడు కృష్ణయ్య అని నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఇతని భార్య 20 ఏళ్ల క్రితమే విడిపోయింది. జీవితంపై విరక్తి చెంది విషద్రావణం తాగినట్లు గ్రామస్తులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ నాయుడు తెలిపారు.

డీసీసీ బ్యాంకులో రుణ'మస్తు'

- అన్నదాతలకు అండగా.. వ్యాపారులకు దన్నుగా
- 2025-26 ఆర్థిక సంవత్సర రుణ లక్ష్యం రూ. 807 కోట్లు
- వ్యవసాయానికి రూ.104.69 కోట్ల రుణాలు
- వ్యవసాయేతర రుణాలు రూ. 508.31 కోట్లు
- రూ. 194 కోట్ల డిపాజిట్ల సేకరణ లక్ష్యంగా అడుగులు



కడపలోని డీసీసీ ప్రధాన బ్యాంకు

కడప అగ్రికల్చర్ : పంటల సాగుకు రైతులకు అవసరమైన పెట్టుబడి రుణాలను సకాలంలో అందిస్తూ వారి అభివృద్ధికి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీ) సహకారం అందిస్తోంది. రైతులతోపాటు వ్యాపారులు, డ్వాక్రా సంఘాలకు, హౌసింగ్ రుణాలు, వ్యక్తిగత రుణాలు, ఎడ్యుకేషన్ రుణాలతో పాటు పలు రకాల రుణాలను అందిస్తూ వారి అభివృద్ధిని ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ సాయాన్ని అందిపుచ్చుకుంటున్న రైతులు సకాలంలో పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. జూన్ నెల నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతన్నల పంటల సాగుకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉండేందుకు బ్యాంకులు రుణాలను అందించనున్నాయి. ఈ తరుణంలో ఎవరెవరికి ఎంతెంత రుణాలను ఇవ్వాలనే లక్ష్యాన్ని డీసీసీ బ్యాంకు ఖరారు చేసింది. ఇతర బ్యాంకుల కంటే కొన్నింటిపైన తక్కువ వడ్డీతో రుణాలను అందించి వారి అభివృద్ధికి చేయూతనిస్తోంది.

ఈ ఏడాది లక్ష్యం రూ. 807 కోట్లు..

డీసీసీ బ్యాంకు తరపున జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 807 కోట్ల రుణాలను మంజూరు చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో వ్యవసాయ, స్వల్పకాలిక, దీర్ఘకాలిక, బంగారు ఆభరణాలు, వ్యవసాయేతర రుణాలతోపాటు డ్వాక్రా మహిళలకు రుణాలను ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో బంగారు ఆభరణాలపై రూ. 157 కోట్లు, పంట రుణాల కింద రూ. 69.94 కోట్లు, డ్వాక్రా సంఘాలకు రూ. 152.04 కోట్లు, దీర్ఘకాలిక రుణాల కింద రూ. 96.75 కోట్లు, రైతు నేస్తం కింద రూ. 46.81 కోట్లు, ఇతర రుణాల కింద రూ. 50 కోట్లు రుణాలను ఇవ్వనున్నారు. అలాగే వీటితోపాటు పలు రకాల రుణాల కింద మొత్తంగా రూ. 613 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. వీటితోపాటు డిపాజిట్ల కింద వివిధ వర్గాలు, ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ. 194 కోట్లు సేకరించాలని బ్యాంకు వారు టార్గెట్ పెట్టుకున్నారు. అయితే డిపాజిట్లకు సంబంధించి 7.65 శాతం వడ్డీ ఇవ్వనున్నారు. ఇందులో సీనియర్ సిటిజన్లు చేసిన డిపాజిట్లకు 8.15 శాతం వడ్డీని చెల్లించనున్నారు.

కడపలో డీసీసీ బ్యాంకు ఏర్పాటు	1919 సంవత్సరం
కడప, అన్నమయ్య జిల్లాలు కలుపుకుని ఉన్న బ్రాంచులు	24
జిల్లాలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు	72
డీసీసీ బ్యాంకులో గత ఏడాది వరకు ఇచ్చిన మొత్తం రుణాలు	రూ.3276.29 కోట్లు
ఈ ఏడాది చివరి నాటికి చేరుకోనున్న లక్ష్యం	రూ.4083 కోట్లు

ఎలాంటి సిఫార్సులు లేకుండానే..



డీసీసీ బ్యాంకులో రుణాల మంజూరుకు ఎలాంటి సిఫార్సులు అవసరం లేదు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రుణాలను మంజూరు చేస్తాం. కమర్షియల్ బ్యాంకుల్లో లాగా మా బ్యాంకులో కూడా అన్ని రకాల రుణాలను అందిస్తున్నాము. రుణాలు కావాల్సిన వారు పత్రాలను తీసుకుని నేరుగా వచ్చి బ్యాంకు అధికారులను సంప్రదించవచ్చు. పరిశీలించి అర్హత ఉంటే రుణాలను మంజూరు చేయించుకోవచ్చు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాల్సి ఉంటుంది.

– రాజామణి, సీఈఓ(ఇన్‌చార్జి), డీసీసీ బ్యాంకు. కడప

హత్యాయత్నం కేసులో పదేళ్ల జైలుశిక్ష

మదనపల్లె రూరల్ : అమ్మాయి విషయమై జరిగిన గొడవలో కక్ష పెంచుకుని ఓ వ్యక్తిపై హత్యా యత్నం చేసిన నిందితుడికి పదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.30వేల జరిమానా విధిస్తూ సోమవారం మదనపల్లె 7వ అడిషనల్ జిల్లా కోర్టు జడ్జి శ్రీలత తీర్పు ఇచ్చారు. చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణం నక్కబండ ఇస్లాంనగర్‌కు చెందిన రాజా అలియాస్ తోటి రాజేష్(22) అదే ప్రాంతానికి చెందిన ఫారుఖ్‌తో ఒక అమ్మాయి విషయంలో గొడవ పడ్డాడు. దీంతో రాజేష్, ఫారుఖ్‌పై కక్ష పెంచుకుని చంపాలనే ఉద్దేశంతో 2022 జూన్ 25వ తేదీ సాయంత్రం సుమారు 4.30 గంటల సమయంలో నక్కబండలో పంచాయతీలో ఉన్న అతడిపై కత్తితో కడుపుపై పొడిచి హత్యాయత్నం చేశాడు. ఘటనపై పుంగనూరు పోలీస్ స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ మోహన్‌కుమార్ క్రైమ్‌నెం.211/2022 కింద 307 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదుచేసి రాజాను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో భాగంగా సోమవారం మదనపల్లె 7వ అడిషనల్ జిల్లా కోర్టులో విచారణ ముగియడంతో న్యాయమూర్తి శ్రీలత, ముద్దాయి రాజాకు పదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.30వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. కేసులో అడిషనల్ పీపీ జయనారాయణరెడ్డి వాదనలు వినిపించారు. నిందితుడికి శిక్ష పడేందుకు కృషి చేసిన ఎస్ఐలు మోహన్‌కుమార్, సుబ్బారెడ్డి, కోర్టు కానిస్టేబుల్ ప్రవీణ్‌కుమార్, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, సిబ్బందిని చిత్తూరు ఎస్పీ వి.ఎన్.మణికంఠ చందోలు ప్రత్యేకంగా అభినందించారు.


ముద్దాయిని జైలుకు తరలిస్తున్న పోలీసులు

పాస్‌పోర్ట్ సేవలలో అన్నమయ్యకు రాష్ట్రంలోనే అగ్రస్థానం


అవార్డును అందుకున్న స్పెషల్ బ్రాంచ్ పోలీసులను అభినందిస్తున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి : పాస్‌పోర్ట్ దరఖాస్తులను గడువు లోపల అత్యంత వేగవంతంగా విచారణ పూర్తి చేసి, అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రంలోనే అన్నమయ్య జిల్లాకు మొదటి స్థానం సాధించి గొప్ప విజయాన్ని నమోదు చేశారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆధ్వర్యంలో జిల్లా పోలీసులు జులై 2024 నుంచి జూన్ 2025 మధ్య కాలంలో 30 వేలకు పైగా పాస్‌పోర్ట్ దరఖాస్తులను గడువు లోపలే వేగవంతంగా విచారణను పూర్తి చేసి ఈ ఘనతను సాధించారు. విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయంలో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి కె.శివహర్ష చేతుల మీదుగా అన్నమయ్య జిల్లా పోలీసు విభాగం తరపున జిల్లా స్పెషల్ బ్రాంచ్ విభాగం సీఐ పి.రాజారమేష్ అవార్డును అందుకున్నారు. అవార్డుతో సోమవారం స్పెషల్ బ్రాంచ్ విభాగం సీఐ, సిబ్బంది జిల్లా ఎస్పీని కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మాట్లాడుతూ పాస్‌పోర్ట్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతంగా, సమర్థవంతంగా నిర్వహించడం జిల్లా పోలీసుల సేవా నిరతికి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ పౌర సేవలను మెరుగుపరచడంలో పోలీసు సిబ్బంది కృషికి దక్కిన గౌరవం అన్నారు. అన్నమయ్య జిల్లా పోలీసు యంత్రాంగం ఈ గుర్తింపుతో మరింత ప్రోత్సాహంతో ముందుకు సాగుతుందని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజా సమస్యల వేదిక

జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు


అర్జీదారుని సమస్యను అడిగి తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి : ప్రజల సమస్యలను తెలుసుకుని చట్ట పరిధిలో వాటి పరిష్కారం కోసం పనిచేయడమే మన బాధ్యత అని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు జిల్లా పోలీస్ యంత్రాంగానికి సూచించారు. సోమవారం రాయచోటిలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితుల సమస్యను వివరాలతో సహా అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులకు పంపించి త్వరగా పరిష్కరించమని ఆదేశించారు. దివ్యాంగులు, వృద్ధులు, మహిళల సమస్యలపై సత్వరమే సమగ్ర విచారణ జరిపి, వారి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు.

దివ్యాంగుడితో ఎస్పీ : రైల్వేకోడూరు మండలం సి.కమ్మపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు బాబు కోటేశ్వరరావు నడవలేని స్థితిలో ఉన్న తన తల్లి సమస్యను చెప్పుకునేందుకు జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్పీ అతని వద్దకు వెళ్లి సమస్య విన్నారు. అతను ఇచ్చిన ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి చట్ట పరిధిలో అతని సమస్యను పరిష్కరించాలని రాజంపేట ఏఎస్పీని ఆదేశించారు.

పోలీసు శాఖలో అత్యాధునిక వ్యవస్థ సీసీటీఎన్ఎస్


పోలీసు సిబ్బందికి అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : సీసీటీఎన్ఎస్ పోలీసు పనితీరును సమూలంగా మార్చే అత్యాధునిక వ్యవస్థ అని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు అన్నారు. రాయచోటిలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఐటీ కోర్ టీమ్ కార్యాలయంలో పోలీసు సిబ్బందికి నాలుగు రోజుల క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ ఫౌండేషన్ కోర్సును జిల్లా ఎస్పీ ప్రారంభించారు. నేడు క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ ఫౌండేషన్ కోర్సు జిల్లా పోలీసు విభాగంలో ఒక ముఖ్యమైన ముందడుగు అని ఎస్పీ అభిప్రాయపడ్డారు. సీసీటీఎన్ఎస్ ద్వారా నేరాల దర్యాప్తును, నేరగాళ్ల గుర్తింపును, సమాచార మార్పిడిని మరింత వేగంగా, సమర్థవంతంగా చేయగలుగుతామని తెలిపారు. నేటి డిజిటల్ యుగంలో సాంకేతిక నైపుణ్యాలు చాలా అవసరమన్నారు.

అపకోప్స్, మొబైల్ మేనేజ్మెంట్ అప్లికేషన్స్..

పోలీసు స్టేషన్లకు సంబంధించిన సమాచారం, ఎఫ్ఐఆర్ కాపీలు తదితర విషయాలు ఎవరికి పడితే వారికి చేరవేసేలాగా దుర్వినియోగం కానివ్వకుండా ఆధునిక సాంకేతికతను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం నుండి ఆల్ ఇన్‌వన్ కంపాక్ట్ డిస్క్ టాప్స్ 136, ప్రింటర్లు 39, వెబ్ కామ్స్ 34, జిల్లాకు కేటాయించారన్నారు. ప్రతి పోలీసు స్టేషన్‌కు నాలుగు చొప్పున మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ వ్యవస్థను ఎంత బాగా ఉపయోగిస్తే ప్రజలకు అంత మంచి సేవలను అందించగలమని ఎస్పీ సిబ్బందికి అవగాహన కల్పించారు.

మహిళ కడుపులో 3 కిలోల కణితి తొలగింపు


మహిళ కడుపులో నుంచి తొలగించిన కణితిని చూపుతున్న వైద్య బృందం

రాయచోటి టౌన్ : రాయచోటి మండల పరిధిలోని యండపల్లెకు చెందిన అంజనమ్మ అనే మహిళ కడుపులో నుంచి 3 కిలోల బరువున్న కణితిని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల బృందం తొలగించింది. సోమవారం అంజనమ్మకు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌తో పాటు మరికొంతమంది వైద్యుల బృందం శస్త్ర చికిత్స చేసి ఈ కణితిని తొలగించారు. ఈమె గత పదేళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతూ వివిధ ప్రాంతాల్లో వైద్యం చేయించుకుంది. అయినా ప్రయోజనం లేదు. ఈ క్రమంలో సోమవారం రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు ఆమె కడుపులోని కణితిని తొలగించి ఉపశమనం కలిగించారు.

స్కూటీ అదుపుతప్పి మహిళకు గాయాలు

మదనపల్లె రూరల్ : సీటీఎం పంచాయతీ నేతాజీ కాలనీకి చెందిన సురేఖ (33) ఆదివారం రాత్రి సొంతపనులపై మదనపల్లెకు వచ్చి తిరిగి ఇంటికి వెళుతుండగా కొత్తవారిపల్లె వద్ద స్కూటీ అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడింది. స్థానికులు బాధితురాలిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడిపై కక్ష సాధింపు


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న బాధిత రైతు, గ్రామస్తులు

పెద్దతిప్పసముద్రం : మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం చేసుకునే వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులపై కూడా కూటమి నాయకులు కక్ష సాధింపులకు పాల్పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని నవాబుకోట పంచాయతీ గుగ్గిళ్లపల్లికి చెందిన బాబురెడ్డి అనే రైతు తనకున్న రెండెకరాల పొలంలో టమాటా పంట సాగు చేశాడు. బోరులో ఒక్కసారిగా జలాలు అడుగంటి పోవడంతో టమాటా పంటను కాపాడుకునేందుకు కొత్తగా బోరు వేసేందుకు ప్రయత్నించాడు. తన పొలంలో భూగర్భ జలం అడుగంటడంతో పక్కనే ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో బోరు వేయిస్తుండగా కూటమి నాయకులు రెవెన్యూ సిబ్బందిని అక్కడికి పంపి బోరు డ్రిల్లింగ్‌ను నిలుపుదల చేయించారు. దీంతో బాధిత రైతు స్థానికంగా ఉంటున్న మాజీ జెడ్పీటీసీ సీవీ రమణ, మాజీ సర్పంచ్ గిరిస్వామిలతో కలసి సోమవారం తహసీల్దార్ శ్రీరాములు నాయక్‌కు తన గోడును వెళ్లబోసుకున్నాడు. అయితే ప్రభుత్వ స్థలంలో బోరు వేయడం కుదరదు, మీరు కావాలంటే ఇరిగేషన్ శాఖ అధికారుల అనుమతితో వేసుకోపొండన్నారు. కాగా అదే ప్రభుత్వ స్థలంలో అనధికారికంగా రైతులు 20కి పైగా బోర్లు వేశారు. మానవతా దృక్పథంతో కరుణించండి అని ప్రాధేయపడినా తహసీల్దార్ ససేమిరా అన్నారు.

దూసుకొచ్చిన ప్రమాదం


చికిత్స పొందుతున్న నందిత

బి.కొత్తకోట : స్కూలుకు వెళ్లేందుకు రోడ్డు పక్కన వేచి ఉన్న ఓ బాలికపైకి సిమెంటు మిల్లర్ దూసుకు వచ్చి ఢీకొనడంతో ఆమె ఎడమ కాలు విరిగింది. ఈ ఘటన సోమవారం బి.కొత్తకోటలో జరిగింది. స్థానిక బైపాస్‌రోడ్డు వద్ద స్కూలుకు వెళ్లేందుకు నందిత (11) వేచి ఉండగా టాటాఏస్ వాహనం వెనుక తాడుతో కట్టిన సిమెంట్ మిల్లర్ యంత్రం తాడు తెగిపోవడంతో అది నందిత మీదకు రావడంతో ఎడమకాలుకు తీవ్ర గాయమైంది. చికిత్స కోసం స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

గ్రామాల్లో వ్యాపిస్తున్న విష జ్వరాలు


సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రిలో జ్వర పీడితులు

సిద్దవటం : సిద్దవటం మండలంలోని పి. కొత్తపల్లి, గొల్లపల్లి, కనుమలోపల్లి గ్రామాలకు చెందిన వారు విషజ్వరాలు సోకి సోమవారం సిద్దవటంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చలి జ్వరం, కడుపునొప్పి, విరేచనాలు, కీళ్ల నొప్పులతో వైద్య శాలకు వచ్చారని డాక్టర్ ప్రకాష్ తెలిపారు. వాతావరణంలో మార్పులు, అపరిశుభ్రత కారణంగా విష జ్వరాలు సోకుతున్నట్లు తెలుస్తోంది.

వివాహిత ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యకు యత్నించిన వివాహిత

మదనపల్లె రూరల్ : ములకలచెరువు మండలం వేపూరికోట పంచాయతీ పత్తికోటకు చెందిన శ్రీనివాసులు భార్య రేఖ(31) వ్యక్తిగత సమస్యలతో విష పదార్థం తిని ఆత్మహత్యకు యత్నించింది. భర్త ఉపాధి నిమిత్తం కువైట్‌లో ఉండగా కుమారుడు బెంగళూరులో చదువుకుంటున్నాడు. స్థానికులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ములకలచెరువు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఎస్టీ వర్గీకరణ కోసం యానాదుల పోరుబాట


ఎస్టీ వర్గీకరణ కోసం రాజంపేటలో యానాదుల ర్యాలీ

రాజంపేట : ఎస్టీ వర్గీకరణ అమలు చేయాలంటూ యానాదులు సోమవారం రాజంపేటలో ర్యాలీ నిర్వహించారు. యానాది రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పులిశంకర్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో యానాది రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకుడు బాపట్ల బ్రహ్మయ్య, ఉద్యోగులసంఘం రాష్ట్ర అధ్యక్షుడు చేవ్వూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. యానాది రిజర్వేషన్ పోరాట సమితి నాయకుడు కల్లూరు చిన్నపెంచలయ్య మాట్లాడుతూ ఎస్టీ వర్గీకరణతో యానాదులకు న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ వైకోమ్‌నైదియాదేవికి యానాదులు వినతిపత్రం అందజేశారు.